క్లుప్తంగా

ఆర్బీకేలతో ఎంతో ఉపయోగం



నెల్లూరు(సెంట్రల్): గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ పెంచలరెడ్డి, నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విధి నిర్వహణలో అలసత్వం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు హెచ్చరించారు. జిల్లా సర్కిల్ పరిధిలోని గూడూరు, నాయుడుపేట డివిజన్ల విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాలను ఆయా ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. రైతులకు పగటి పూట తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న 30 రోజుల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అధికారులు, సిబ్బంది వారికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని చెప్పారు. ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని, జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఇస్మాయిల్, శ్రీధర్, రాఘవేంద్రం, బెనర్జీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చర్యలు



నెల్లూరు(బారకాసు): మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఇటీవల సంభవించిన మాతాశిశు మరణాలపై సబ్ కమిటీతో సమీక్ష సమావేశాన్ని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల తన చాంబర్‌లో డీఎంహెచ్ఓ శుక్రవారం నిర్వహించారు. రెండు మాతృ, 11 శిశు మరణాలపై సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైద్యులతో సకాలంలో పరీక్షలు, సరైన ప్రసవ ప్రణాళిక ద్వారా మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించొచ్చని చెప్పారు. డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఇన్‌చార్జి డీఎల్ఏటీఓ బ్రిజిత, డాక్టర్ దయాకర్, డీఐఓ శెలీనాకుమారి, గైనకాలజిస్ట్ ఇందిర, డాక్టర్లు రామచంద్ర, కవిత, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట మార్కెట్ యార్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని నవాబుపేట, కుమ్మరవీధి, చాకలివీధి, ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట, పుల్లమ్మసత్రం, షిర్డీసాయినగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఫీడర్‌లో గల బాలాజీనగర్, ఆదిత్యనగర్, గుర్రాలమడుగు సంఘం, రామ్‌జీనగర్, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.
- మహాత్మాగాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనరసింహపురం, రామాలయ వీధి, బారాషహీద్ దర్గా, ఆదర్శ్‌నగర్, లేక్‌వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డినగర్, బషీర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ప్రశాంతినగర్, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం, ఎల్ఐసీ కార్యాలయం, జీవీఆర్ కాలనీ, నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని వివరించారు.
- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉమ్మారెడ్డిగుంట, రవీంద్రనగర్, బీవీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని తెలిపారు.

ప్రణాళికబద్ధంగా నగరాభివృద్ధి

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



కాలువను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 45వ డివిజన్లో గల పొగతోట, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. స్థానికుల సమస్యలను ఆరాతీసి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 52వ డివిజన్ రంగనాయకులపేటలోని ముస్లిం శ్మశాన వాటికలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పొగతోటలో రోడ్లు, డ్రెయిన్ల పనులకు నెల్లో శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. ఏయే డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎంతెంత ఖర్చు చేశామనే వివరాలను ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. రంగనాయకులపేటలోని ముస్లిం శ్మశాన వాటికలో రెండు స్నానపు గదులు, నమాజ్ చేసుకునేందుకు ఒక షెల్టర్, తదితరాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు ముదిరెడ్డి వేదవతమ్మ, అస్మ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కల్లూరుపల్లిలో రూ.42 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. అవసరమైతే ఈ ప్రాంతానికి మరో రూ.20 లక్షలను కేటాయించనున్నామని వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ విషయాన్ని గమనించామని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా జాతీయ రహదారిపై టోల్‌గేట్ ఏర్పాటును అడ్డుకోవాలని ఎంపీని పలువురు సీపీఎం నేతలు కోరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు గౌరి, శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నేతలు శేఖర్, శ్రీదేవి, హరిబాబుయాదవ్, మల్లికార్జున్‌యాదవ్, కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. 42వ డివిజన్లోని కోటమిట్ట షాదీ మంజిల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి అబ్దుల్ మస్తాన్ తన మిత్ర బృందం 200 మందితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పార్టీ వైపు పలువురు ఆకర్షితులవుతున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా ఉన్నప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో తనను ఆదరించిన ముస్లింలకు ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. నారా లోకేశ్ జిల్లా పర్యటనకు వచ్చిన నాటి నుంచి తన పేరును తలచుకోని రోజు లేదని విమర్శించారు. 2019 ఎన్నికల అనంతరం నారాయణను నగర ప్రజలు పట్టించుకోలేదని చెప్పారు. హైదరాబాద్‌లో ఉండేవారు అక్కడే పోటీ చేయొచ్చు కదానని ప్రశ్నించారు. చాంద్‌బాషా, బషీర్, ముస్తాఖ్, అబీద్, ఖాదర్‌బాషా, ఖయ్యూం, అమన్, గౌస్‌మొహిద్దీన్, నౌషాద్, షాకీర్, తదితరులు పార్టీలో చేరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 20వ డివిజన్లోని రామకృష్ణనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో కలిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని వివరించారు. రూరల్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికంగా కేటాయిస్తున్నారని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి రూ.20 లక్షలను మంజూరు చేశారని, మరో రూ.20 లక్షలను సైతం కేటాయిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీని ఆదరించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు శ్రీనివాసరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని పురమందిరంలో గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, అభినందన సభను ఆదివారం నిర్వహించనున్నామని గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షులు తోట ప్రభాకర్, కోసూరు రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సుజాతమ్మ కాలనీలోని దివంగత కోసూరు గోవిందయ్య గౌడ్ నివాసంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పదో తరగతిలో అత్యధిక మార్కులను సాధించిన 133 మంది గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని వివరించారు. నేతలు ముత్యంగౌడ్, శ్రీనివాసులు, రమణయ్య, రామకృష్ణ, సుబ్బారావు, రామచంద్రయ్య, నిమ్మల సుబ్బయ్య, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌఖిక పరీక్షలు



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం, స్పెషల్ తెలుగు విభాగాల్లో తృతీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన మౌఖిక పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టులో లాజిస్టిక్స్ అండ్ సేల్స్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై ఆర్నెల్ల పాటు చేసిన ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగాధిపతి సుదర్శన్, అధ్యాపకులు జోజీ, వెంకట్రావు, జాన్‌సాహెబ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్, సీఈఓకు సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీబొమ్మ సమీపంలోని డీసీసీబీ ప్రధాన పరిపాలన కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈఓ శంకర్‌బాబును శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నేత కుమార్‌పాల్ మాట్లాడారు. డీసీసీబీలోని పలు క్యాడర్లలో విధులు నిర్వర్తిస్తున్న 39 మంది ఉద్యోగులకు పారదర్శకంగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో సత్కరించామని తెలిపారు. డీసీఓ సుధాభారతి, బ్యాంక్ జీఎం సరిత, డీజీఎం మధు, ఏజీఎం శ్రీనివాసరెడ్డి, యూనియన్ నేతలు ప్రజ్ఞ, సాజిత, గాయత్రి, నళిని, కోటేశ్వరరావు, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వివిధ సమస్యలను పరిష్కరించాలని డీసీసీబీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ శంకర్‌బాబుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగ విరమణ పొందిన డీసీసీబీ ఉద్యోగులకు హెల్త్ ఇన్సురెన్స్, పింఛన్ సౌకర్యం, తదితరాలను కల్పించాలని కోరారు. నేతలు కాంతారావు, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భార్య కళ్లెదుటే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని..

- ఇంటికి రాకపోవడంతో భర్త ఘాతుకం

నెల్లూరు(క్రైమ్): ఇంటికి భార్య రాలేదనే మనస్తాపంతో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న భర్త తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ఆర్జీజే కాలనీకి చెందిన మోషే శెట్టిగుంటరోడ్డుకు చెందిన పద్మను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండేళ్లుగా దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. అనుమానం వారి కాపురంలో చిచ్చురేపింది. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం దంపతుల నడుమ గొడవ తారస్థాయికి చేరుకుంది. దీంతో భర్తపై అలిగి డైకస్‌రోడ్డులోని తాతయ్యబడి సమీపంలో ఉంటున్న తన అక్క అమ్ములు వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. రోజూ మోషే అక్కడికి వెళ్లి భార్యను ఇంటికి రావాలని బతిమిలాడినా ఆమె నిరాకరించారు. ఈ క్రమంలో గురువారం మరోసారి వెళ్లి భార్యను ఇంటికి రావాలని కోరారు.

నిరాకరించడంతో మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆమె కళ్లెదుటే నిప్పంటించుకున్నారు. ఊహించని పరిణామంతో భార్య పెద్దగా కేకలేశారు. పద్మ, ఆమె అక్కాబావ మంటలను ఆర్పి మోషేను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు హుటాహుటిన తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన ఓపెన్ వర్సిటీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయని వర్సిటీ కోఆర్డినేటర్ పిచ్చయ్య, స్టడీ ఇన్‌చార్జి రత్నయ్య తెలిపారు. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 240 మంది అభ్యాసకులు హాజరయ్యారని వివరించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ భవనాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నగరంలో మెరుగైన పారిశుద్ధ్య సేవలను అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించే సాంకేతికతను ఇందులో ఏర్పాటు చేశామన్నారు. వివిధ కార్యక్రమాలను ఈ కేంద్రంలో నిర్వహించనున్నామని వివరించారు.

రసీదులను తప్పక ఇవ్వాలి



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లూరు(సెంట్రల్): పురుగుమందులు, ఎరువులను కొనుగోలు చేసిన వారికి రసీదులను దుకాణాల నిర్వాహకులు తప్పక ఇవ్వాలని నెల్లూరు మండల వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. నగరంలోని పలు దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగమోహన్ మాట్లాడారు. పురుగుమందుల వివరాలు, ధరల పట్టికను దుకాణం ముందు విధిగా ప్రదర్శించాలని సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



నెల్లూరు(పొగతోట): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, తదితరాలపై ఆగస్ట్ ఒకటి నుంచి 20 వరకు అవగాహన కల్పించాలన్నారు.

కరోనా సమయంలోనూ విస్తృత సేవలు



పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ సువర్ణ

నెల్లూరు రూరల్: కరోనా మహమ్మారి సమయంలోనూ ఏ మాత్రం వెనుకడుగేయకుండా కాకుపల్లి బిట్ – 1 సచివాలయ పరిధిలోని క్లస్టర్ – 6లో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోసూరు సువర్ణ విస్తృత సేవలను అందించారు. ఆ సమయంలో పింఛన్లు, ఇతర పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. అప్పుడు పలువురికి అండగా నిలుస్తూ నిత్యావసర సరుకులు, కూరగాయలను అందించి ప్రశంసలను అందుకున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారు.

రుణపడి ఉంటాం



కరోనా సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకేవాళ్లం. అప్పుడూ వలంటీర్ సువర్ణ ఎంతో ధైర్యంగా అందరి ఇళ్లకు వచ్చి పింఛన్లతో పాటు ఇతర పథకాలను అందించారు. ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ అందరితో కలిసిపోతున్నారు. ఆమెకు ఎంతో రుణపడి ఉన్నాం.

– మస్తానమ్మ, లింగాయపాళెం

ఉద్యోగుల పే స్కేల్ వివరాలు తెలియజేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల్లో (పీఏసీఎస్) విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు నిర్ణయించిన పే స్కేల్ వివరాలను తెలియజేయాలని డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని డీసీసీబీ ప్రధాన పరిపాలన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డీఎల్ఈసీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రావాల్సిన హెచ్ఆర్ పాలసీ, అరియర్స్, నిర్ణయించిన పే స్కేల్‌కు సంబంధించి డీఎల్ఈసీ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. ఇందులో తనతో పాటు డీసీఓ, బ్యాంక్ సీఈఓలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. పీఏసీఎస్ ఉద్యోగుల పే స్కేల్‌కు సంబంధించిన వివరాలు.. డీసీఓ నిర్ణయించిన పే స్కేల్ వివరాలను ఉద్యోగులకు తెలియజేయాలని కోరారు. డిసెంబర్ నాలుగు, 2020 నుంచి ఈ ఏడాది మే 31 వరకు ఉద్యోగులకు అందుతున్న వేతనాల్లో తేడాలను సైతం వారికి తెలియజేయాలని కమిటీ తీర్మానించిందన్నారు. డీసీఓ సుధాభారతి, తిరుపతి డీసీఓ శ్రీనివాసులురెడ్డి, బ్యాంక్ సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా సాగితే రాజ్యాధికారం



నెల్లూరు(బృందావనం): ఐక్యంగా సాగి రాజ్యాధికారం వైపు బీసీలు అడుగులేయాలని ఏపీ బీసీ సమన్వయ వేదిక నేతలు పిలుపునిచ్చారు. పురమందిరంలో శుక్రవారం నిర్వహించిన బీసీ కులాల సమన్వయ వేదిక జిల్లా శాఖ సమావేశంలో పలువురు మాట్లాడారు. మండల్ కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం విశ్రాంత న్యాయమూర్తి రేగలగడ్డ సంజీవయ్య, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, తదితరులను సత్కరించారు. నేతలు సుబ్రహ్మణ్యంయాదవ్, వెంకటేశ్వరరావు, హైకోర్టు అడ్వొకేట్ గోపాలకృష్ణ, నూర్‌బాషా సంఘ జిల్లా అధ్యక్షుడు కాలేషా, శ్రీహరి, కొమారి విజయమ్మ, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి









నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మణ్ణిని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు ఎనిమిది వేల కిలోల కూరగాయలు, వెయ్యి కిలోల పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అర్ధనారీశ్వరుడు, కృష్ణపరమాత్ముడు, కన్యకాపరమేశ్వరి రూపాలతో పాటు అంతరాలయం, ఆలయ ఉత్తర గోపురాన్ని కాయగూరలతో తీర్చిదిద్దారు. ఉభయకర్తలుగా పాదర్తి బాలాజీ, పైడా హేమంత్‌కుమార్, తన్నీరు కిషోర్‌కుమార్, పబ్బిశెట్టి నందకిషోర్, పసుమర్తి కుమార్, తదితరులు వ్యవహరించారు. అలంకరణ అనంతరం కాయగూరలు, పండ్లను భక్తులకు వితరణ చేయడంతో పాటు గోశాలలకు సైతం పంపనున్నామని ద్వారకానాథ్ తెలిపారు. ఆలయ పాలకమండలి చైర్మన్ సుంకు మనోహర్, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, బైసాని జ్యోతిప్రసాద్, చలువాది శరణ్‌కుమార్, జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, గౌరవాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.